ఆనందమని పింఛెన్

- వైఎస్సార్ పింఛన్ కానుక రూ.3 వేలకు పెంపు
- అవ్వాతాతల ఆత్మగౌరవాన్ని కాపాడిన ప్రభుత్వం
- లబ్ధిదారుల హర్షం


2017 జూన్ నెలలో పింఛన్ కోసం ఎంపీడీఓ కార్యాలయం వద్ద పడిగాపులు కాస్తున్న నెల్లికిక్కువ పంచాయతీ వృద్ధులు


లబ్ధిదారులకు పింఛన్ డబ్బులు అందజేస్తున్న ఎమ్మెల్యే పాముల పుష్పశ్రీవాణి

గుమ్మలక్ష్మీపురం: 'వైఎస్సార్ పింఛన్ కానుక'తో అవ్వాతాతలకు ఆర్థిక భరోసా లభిస్తోంది. కన్న కొడుకులు పట్టించుకున్నా పట్టించుకోకపోయినా.. ఇంటి పెద్ద కొడుకులా ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ప్రతీ నెలా ఒకటో తేదీన ఠంచన్‌గా పింఛన్ అందిస్తుండడంతో హర్షం వ్యక్తం చేస్తున్నారు. నెలవారీ ఆర్థిక అవసరాల కోసం ఇతరులపై ఆధారపడాల్సిన అవసరం లేకుండా ప్రభుత్వం ఇస్తున్న డబ్బులతో సంతోషంగా జీవిస్తున్నామని అంటున్నారు. గతంలో పింఛన్ డబ్బులు తీసుకునేందుకు పంచాయతీ కార్యాలయం వద్ద రోజంతా ఎదురు చూడాల్సి వచ్చేది. పింఛన్ ఎప్పుడు అందుతుందో తెలిసేది కాదు. కొత్త పింఛన్ కావాలంటే జన్మభూమి కమిటీల సిఫార్సు తప్పనిసరి. అందుకోసం వారికి ముడుపులు చెల్లించాల్సిన పరిస్థితి. కానీ నేడు జగనన్న ప్రభుత్వంలో అర్హత ఉంటే చాలు పార్టీలకు అతీతంగా ప్రతీ ఒక్కరికీ ఇంటి వద్దకే వచ్చి పింఛన్లు అందిస్తున్నారు. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో గుమ్మలక్ష్మీపురం మండలంలో 3730 మందికి పింఛన్ అందగా.. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో కొత్తగా 3126 మందికి పింఛన్లు మంజూరు చేసింది. ప్రస్తుతం మండలంలో మొత్తం 6856 మంది లబ్ధిదారులకు రూ.3 వేలు చొప్పున పింఛన్ అందిస్తున్నారు.

పింఛన్ మంజూరు చేశారు



గతంలో పలుమార్లు పింఛన్ కోసం దరఖాస్తు చేసుకున్నప్పటికీ మంజూరు కాలేదు. ఎంతో నిరాశ చెందాను. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఈ నెల నుంచి నాకు పింఛను మంజూరు చేసింది. అంతే కాకుండా పెంచిన పింఛను మొత్తం రూ.3 వేలును అందజేసింది. చాలా సంతోషంగా ఉంది. – గౌడు ఉదయ్‌కుమార్, దివ్యాంగ పింఛన్ లబ్ధిదారు, లక్కగూడ గ్రామం

తలుపుతట్టి ఇస్తున్నారు



గతంలో పింఛన్ తీసుకునేందుకు ఐదారు రోజుల సమయం పట్టేది. ఉదయం నుంచి సాయంత్రం వరకు పనులు మానుకుని పడిగాపులు కాసిన సందర్భాలు ఉన్నాయి. ముఖ్యమంత్రిగా జగన్‌మోహన్‌రెడ్డి బాధ్యతలు చేపట్టాక వలంటీర్ల ద్వారా ఒకటో తేదీ ఉదయమే ఇంటి వద్దకు పింఛన్ డబ్బులు పంపిస్తున్నారు.
– కొండగొర్రి కోనమ్మ, పింఛన్ లబ్ధిదారు, రేగిడి గ్రామం

పంచాయతీ కార్యాలయానికి వెళ్లేవాళ్లం



ప్రతీ నెల పింఛన్ సొమ్ము కోసం గతంలో టంకు నుంచి గొయిపాక గ్రామానికి కొండ దిగి వెళ్లేదాన్ని. ఒక రోజులో పింఛన్ అందేది కాదు. ఒక్కోసారి పింఛన్ కోసం వారం రోజులు తిరగాల్సి వచ్చేది. ఇప్పుడేమో ఇంటి వద్దే పింఛన్ సొమ్ము అందుతోంది. ఎంతో సంతోషంగా ఉంది.
– కిల్లక రామమ్మ, వృద్ధాప్య పింఛనుదారు, టంకు

మండలంలో పింఛన్ లబ్ధిదారుల వివరాలు	
పింఛన్	లబ్ధిదారుల సంఖ్య
వృద్ధాప్య	3,563
అభయహస్తం	68
చేనేత	2
దివ్యాంగ	416
వితంతు	2642
కల్లుగీత	1
ఒంటరి మహిళలు	124
ట్రాన్స్‌జెండర్స్	21
డప్పు కళాకారులు	17
చెప్పులు కుట్టేవారు	2

అవ్వాతాతలకు అండగా జగనన్న..

- పింఛన్ల పంపిణీలో ఎమ్మెల్యే పుష్పశ్రీవాణి

గుమ్మలక్ష్మీపురం: అవ్వాతాతలకు అండగా ముఖ్య మంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నిలుస్తున్నారని ఎమ్మెల్యే పాముల పుష్పశ్రీవాణి అన్నారు. మండల కేంద్రమైన గుమ్మలక్ష్మీపురంలోని బీఎస్‌ఆర్ కళింగవైశ్య కళ్యాణ మండపంలో శనివారం నిర్వహించిన పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో ఆమె పాల్గొని లబ్ధిదారులకు పింఛన్ డబ్బులు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో గ్రామంలోని పింఛన్‌దారులలో ఎవరైనా ఒకరు చనిపోతే మరొకరికి పింఛన్ మంజూరు చేసేవారని, ఆ పింఛను కోసం జన్మభూమి కమిటీలు, ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన పరిస్థితి ఉండేదని, ఇచ్చే కొద్దిపాటి పింఛను కోసం ముడుపులు కూడా చెల్లించాల్సివచ్చేదన్నారు. కానీ జగనన్న ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన తరువాత పింఛన్ల పెంపుపై తొలి సంతకం చేశారని గుర్తుచేశారు. అవ్వాతాతలకు నేడు రూ.3 వేలు పింఛన్ అందిస్తూ ఇంటి పెద్ద కొడుకులా భరోసా ఇస్తున్నారన్నారు. పింఛన్ల కోసం ఎక్కడకీ వెళ్లాల్సిన అవసరం లేదని, వలంటీర్లే ఇంటి వద్దకు వచ్చి పింఛన్లు అందిస్తున్నారని అన్నారు. అన్ని వర్గాల ప్రజలకు మేలు జరిగేలా సంక్షేమ పాలన అందిస్తున్న జగన్‌మోహన్‌రెడ్డిని రానున్న ఎన్నికల్లో మరోసారి అఖండ మెజార్టీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ కుంబురుక దీనమయ్య, జెడ్పీటీసీ మండంగి రాధిక, వైస్ ఎంపీపీ నిమ్మక శేఖర్, రజక కార్పొరేషన్ డైరెక్టర్ గోరిశెట్టి గిరిబాబు, స్థానిక సర్పంచ్ బొత్తాడ గౌరీశంకరరావు, డీఆర్‌డీఏ పీడీ పెద్దింటి కిరణ్‌కుమార్, ఎంపీడీఓ ఎస్.సాల్మన్‌రాజు, వైకేపీ ఏపీఎం ఆదయ్య, తదితరులు పాల్గొన్నారు.

ముందే వచ్చిన పండగ

- పింఛన్ల పెంపుతో లబ్ధిదారుల్లో ఆనందం
- గ్రామాల్లో పండగలా పింఛన్ల పంపిణీ


భామిని: వృద్ధుడికి పింఛన్ డబ్బులు అందజేస్తున్న ఎమ్మెల్యే కళావతి

భామిని: పింఛన్‌ను రూ.3 వేలకు పెంచి అవ్వాతాతలకు ఇచ్చిన ఎన్నికల హామీని సీఎం జగన్‌మోహన్‌రెడ్డి నెరవేర్చారని ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి అన్నారు. మండల కేంద్రంలో ఎంపీడీఓ జె.ఉమామహేశ్వరితో కలిసి కొత్త పింఛన్లను లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలను అమలు చేయకుండా ప్రజలను మోసం చేసిన ఘనుడు మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అయితే, ఇచ్చిన ప్రతీ హామీని అమలు చేసిన నాయకుడు సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అని అన్నారు. ప్రజా సంకల్పయాత్రలో ఇచ్చిన హామీ మేరకు పింఛన్లను రూ.3 వేలకు పెంచారని, కుటుంబంలో అర్హులందరికీ పింఛన్ ఇచ్చేందుకు ప్రభుత్వం ఆలోచన చేస్తోందన్నారు. భామిని మండలంలో జనవరి నెలలో 68 కొత్త పింఛన్లతో కలుపుకొని మొత్తం 7157 మందికి రూ.2.14 కోట్లు విడుదల చేసినట్లు చెప్పారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు తోట సింహాచలం, కొత్తకోట చంద్రశేకర్, బోనగడ్డి ధర్మారావు, గెల్లంకి రమేష్, కొత్తకోట ఆంజనేయులు, దామోదర కంతయ్య, ఎంపీడీఓ ఉమామహేశ్వరి, తదితరులు పాల్గొన్నారు. వీరఘట్టం మండలం పనసనందివాడలో సర్పంచ్ సరోజిని, స్థానిక నాయకులు లబ్ధిదారులకు పింఛన్లు పంపిణీ చేశారు.


భామిని: ఆనందంతో నృత్యాలు చేస్తున్న వృద్ధులు


వీరఘట్టం: పనసనందివాడలో దివ్యాంగుడికి కొత్తగా మంజూరైన పింఛన్‌ను అందజేస్తున్న సర్పంచ్ సరోజిని, ఎంపీటీసీ ప్రకాశరావు, మాజీ సర్పంచ్ సన్యాసినాయుడు, తదితరులు

ప్రతీ కుటుంబానికి సంక్షేమ లబ్ధి

- 'గడపగడపకు మన ప్రభుత్వం'లో ఎమ్మెల్యే కళావతి, ఎమ్మెల్సీ విక్రాంత్


బత్తిలిలో సంక్షేమ పథకాల లబ్ధిని ప్రజలకు వివరిస్తున్న ఎమ్మెల్యే కళావతి, ఎమ్మెల్సీ విక్రాంత్

భామిని: అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి పనిచేస్తున్నారని ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి, ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్‌బాబు అన్నారు. మండలంలోని బత్తిలి-1 సచివాలయం పరిధిలో సర్పంచ్ టింగ శాంతికుమారి, ఎంపీటీసీ టింగ అన్నాజీరావు, కో-ఆప్షన్ సభ్యుడు విశ్వనాథ పట్నాయక్ ఆధ్వర్యంలో శనివారం 'గడపగడపకు మన ప్రభుత్వం' కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే స్థానిక నాయకులు, అధికారులతో కలిసి గ్రామంలోని ఇంటింటికీ వెళ్లి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ఆయా కుటుంబాలకు సంక్షేమ పథకాల ద్వారా చేకూర్చిన లబ్ధిని వివరించారు. సంక్షేమ పాలన అందిస్తున్న సీఎం జగన్‌మోహన్‌రెడ్డిని వచ్చే ఎన్నికల్లో మరోసారి ఆశీర్వదించి ముఖ్యమంత్రిని చేయాలని కోరారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ వమ్మురివిల్లి రమేష్, పార్టీ మండల అధ్యక్షుడు తోట సింహాచలం, వైస్ ఎంపీపీ బోనగడ్డి ధర్మారావు, పార్టీ నాయకులు బోడ్డెపల్లి ప్రసాద్, శివ్వాల తిరుపతి, నిమ్మన దాస్, సర్పంచ్ తోగరాన శ్రీను, ఈఓపీఆర్డీ కృష్ణారావు, వీఆర్వో మోహన్‌దాస్, కార్యదర్శి శ్రీనివాసరావు, సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు పాల్గొన్నారు.

సారా బట్టీలపై దాడి


కొమరాడ: బెల్లం ఊటను ధ్వంసం చేస్తున్న ఎస్‌ఈబీ సిబ్బంది

కొమరాడ: మండలంలోని సీసాడవలస, సంకేసు, బట్టిమొగవలస గ్రామాల సమీపంలోని అటవీ ప్రాంతంలో నిర్వహిస్తున్న సారా తయారీ కేంద్రాలపై ఎస్‌ఈబీ సీఐ ఉపేంద్ర ఆధ్వర్యంలో సిబ్బంది శనివారం దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో 7500 లీటర్ల బెల్లం ఊట, 90 లీటర్ల సారాను ధ్వంసం చేశారు. నలుగురు వ్యక్తులపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ ఉపేంద్ర, ఎస్సై రమణ తెలిపారు.

12 మద్యం బాటిళ్ల స్వాధీనం

పాలకొండ: మండలంలోని పెద్ద కోటిపల్లి గ్రామానికి చెందిన వి.రామకృష్ణ నిబంధనలకు విరుద్ధంగా మద్యం సీసాలు తరలిస్తుండగా పోలీసులు పట్టుకున్నారు. భాసూరు-కోటిపల్లి రోడ్డులో ఎస్సై ప్రశాంత్‌కుమార్ ఆధ్వర్యంలో తనిఖీలు చేపడుతుండగా అటుగా వెళ్తున్న రామకృష్ణ వద్ద 12 మద్యం సీసాలు గుర్తించి పట్టుకున్నారు. కేసు నమోదు చేసినట్లు చెప్పారు.

ఏటీఎం సాగు పద్ధతి లాభదాయకం


ఏటీఎం పద్ధతిలో సాగుచేస్తున్న పంటలను పరిశీలిస్తున్న స్టేట్ బృందం

భామిని: ప్రకృతి వ్యవసాయ విధానంలో ఏటీఎం పద్ధతిలో పంటలు సాగుచేయడం ద్వారా నిరంతరం ఆదాయం పొందవచ్చని ప్రకృతి వ్యవసాయ విభాగం స్టేట్ రిసోర్స్ పర్సన్ ఇ.దేవుళ్లు అన్నారు. మండలంలోని ఘనసరలో ఏటీఎం విధానంలో సాగుచేస్తున్న పంటలను శనివారం ఆయన పరిశీలించారు. ఏటీఎం పద్ధతిలో తక్కువ విస్తీర్ణంలో కూరగాయలు, ఆకుకూరలు, దుంప జాతి, తీగ జాతి పంటలు, పండ్ల మొక్కలు సాగుచేస్తూ ఏడాది పొడవునా ఆదాయం పొందవచ్చన్నారు. ప్రకృతి సాగు ఎస్‌ఎఫ్‌ఏ ముసలయ్య, ఎన్ఎఫ్ఎంటీ బాలు, ఎమ్ఫ్ఎంటీ అంబోజీ, వ్యవసాయ సిబ్బంది ఉన్నారు.

సమస్యలు పరిష్కరించాలి

పాలకొండ రూరల్: తమ సమస్యలను పరిష్కరించాలని నగర పంచాయతీ కార్మికులు డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం నగరపంచాయతీ కార్యాలయం వద్ద సీఐటీయూ నాయకులతో కలిసి ధర్నా చేపట్టారు. ప్రభుత్వం తమ డిమాండ్ల పట్ల స్పందించాలన్నారు. ఆ సంఘ నాయకులు దావాల రమణారావు, పి.భాస్కర్, సీహెచ్.సంజీవి తదితరులు మాట్లాడుతూ సమాన పనికి సమాన వేతనం, కార్మికుల ఉద్యోగ భద్రత, హెల్త్ అలవెన్స్ సెస్, తదితర డిమాండ్లను ప్రభుత్వం పరిష్కరించి కార్మికులకు న్యాయం చేయాలని కోరారు. ఈ క్రమంలో కార్యాలయం ప్రధాన గేట్ వద్ద బైఠాయించి కమిషనర్ సర్వేశ్వరరావుకు తమ డిమాండ్లు విన్నవించారు.

ఆలయ నిర్మాణానికి భూమిపూజ


శంకుస్థాపన పూజలు చేస్తున్న ఎమ్మెల్యే కళావతి, కమిటీ సభ్యులు

భామిని: హిందూ ధర్మ పరిరక్షణకు ప్రభుత్వం కట్టుబడి ఉందని, దేవాలయాల పునరుద్ధరణకు నిధులు కేటాయించి అభివృద్ధి చేస్తోందని ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి, ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్ అన్నారు. మండలంలోని బత్తిలిలో నీలకంఠేశ్వర ఆలయ నిర్మాణానికి శనివారం శంకుస్థాపన చేశారు. ఆయన నిర్మాణానికి టీటీడీకి చెందిన శ్రీవాణీ ట్రస్టు నుంచి రూ.10 లక్షలు నిధులను ప్రభుత్వం మంజూరు చేసిందన్నారు. పాలకొండ నియోజకవర్గంలో 155 ఆలయాల నిర్మాణానికి టీటీడీ నిధులు కేటాయించినట్లు చెప్పారు. కొత్తగా నిర్మిస్తున్న ఆలయానికి వచ్చే దారిలో ఉన్న వెర్రిగెడ్డపై మినీ వంతెన(కాజ్‌వే) నిర్మాణానికి ఉపాధి నిధుల నుంచి రూ.35 లక్షలు కేటాయించినట్లు చెప్పారు. అలాగే గడపగడపకు మన ప్రభుత్వం నిధులతో ఏబీ రోడ్డు నుంచి హైస్కూల్, ఆలయం, శ్మశానం వరకు రోడ్డు నిర్మిస్తామన్నారు. అనంతరం ఎమ్మెల్యే కళావతి, ఎమ్మెల్సీ విక్రాంత్‌లను స్థానిక నాయకులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు కొవ్వాడ చిరంజీవు, పార్టీ మండల అధ్యక్షుడు తోట సింహాచలం, వైస్ ఎంపీపీ బి.ధర్మారావు, నాయకులు మజ్జి మోహనబాబు, బోదెపు శ్రీనివాసరావు, వలరౌతు వెంకటరమణ, సంతోషిమాత ఆలయ కమిటీ చైర్మన్ భాను ప్రసాద్‌సాహు, కమిటీ సభ్యులున్నారు.

సరిహద్దులో అప్రమత్తం


బత్తిలి చెక్‌గేట్ వద్ద రికార్డులు పరిశీలిస్తున్న డీఎస్పీ కృష్ణారావు

భామిని: ఆంధ్రా-ఒడిశా సరిహద్దులో బత్తిలి వద్ద ఏర్పాటు చేసిన చెక్‌పోస్టును పాలకొండ డీఎస్పీ జీవీ కృష్ణారావు శనివారం పరిశీలించారు. ప్రతీ వాహనాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేయాలని, మద్యం, గంజాయి, మత్తు పదార్థాల రవాణాపై నిఘా పెట్టాలని చెక్‌పోస్టు సిబ్బందికి సూచించారు. ఎన్నికలు సమీపిస్తున్నందున సరిహద్దులో విధులు నిర్వహిస్తున్న సిబ్బంది అప్రమత్తంగా ఉండాలన్నారు.

గిరిజన గ్రామాల అభివృద్ధే లక్ష్యం

- ఎమ్మెల్యే పాముల పుష్పశ్రీవాణి


బీటీరోడ్డు నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే పుష్పశ్రీవాణి

కొమరాడ: గిరిజన గ్రామాలకు రహదారి సౌకర్యం కల్పించడమే ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే పాముల పుష్పశ్రీవాణి అన్నారు. మండలంలోని మాదలింగి పంచాయతీ మర్రిగూడ నుంచి చీడిపల్లి గ్రామానికి బీటీ రోడ్డు నిర్మాణానికి శనివారం ఎమ్మెల్యే భూమిపూజ చేశారు. రూ.1.38 కోట్లతో 2.4 కిలోమీటర్ల బీటీ రోడ్డు నిర్మాణం చేపట్టనున్నట్లు చెప్పారు. గిరిజనుల సంక్షేమానికి, గిరిజన గ్రామాల అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందని, ప్రాధాన్యత క్రమంలో అభివృద్ధి పనులు చేపడుతున్నామని అన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ శెట్టి శ్యామల, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ద్వారపురెడ్డి జనార్దనరావు, పార్టీ జిల్లా కార్యదర్శి శెట్టి మధుసుదనరావు, వైస్ ఎంపీపీ సంగిరెడ్డి శరత్‌బాబు, పార్టీ ట్రెజరర్ కళింగ మల్లేశ్వరరావు, పలువురు సర్పంచ్‌లు పాల్గొన్నారు.

దేవాలయ అభివృద్ధికి ప్రణాళికలు


మాట్లాడుతున్న చైర్మన్ సత్యనారాయణ

గరుగుబిల్లి: తోటపల్లి వేంకటేశ్వరస్వామి, కోదండ రామస్వామి ఆలయాల అభివృద్ధికి అవసరమైన ప్రణాళికలు రూపొందించనున్నట్లు ఆలయ చైర్మన్ మర్రాపు సత్యనారాయణ తెలిపారు. ఆలయ ప్రాంగణంలో ఈఓ వీవీ సూర్యనారాయణ ఆధ్వర్యంలో శనివారం ధర్మకర్తల మండలి సభ్యులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వేంకటేశ్వరస్వామి, కోదండరామస్వామి ఆలయాలలో అభివృద్ధి పనులకు సంబంధించి సీజీఎఫ్ నిధుల కోసం ప్రతిపాదనలు తయారు చేసినట్లు చెప్పారు. ప్రస్తుతం జరుగుతున్న పనులను త్వరితగతిన పూర్తిచేసి స్వామివారి వార్షిక కళ్యాణోత్సవానికి ముందు ప్రతిష్ట కార్యక్రమాలు నిర్వహించేలా ప్రణాళికలు చేస్తున్నట్లు చెప్పారు.

ఈవీఎంలపై అవగాహన

బలిజిపేట: వచ్చే ఎన్నికలకు సంబంధించి ఈవీఎంలపై ఉన్న అనుమానాలు నివృత్తి చేసేందుకు బలిజిపేట ఉన్నత పాఠశాల వద్ద ఓటర్లకు అవగాహన కార్యక్రమం శనివారం నిర్వహించారు. ఓటర్లు తమ ఓటు హక్కును ఏ విధంగా వినియోగించుకోవాలనే దానిపై ఈవీఎం యంత్రాల ద్వారా అవగాహన కల్పించారు. ఈవీఎంపై ఓటు ఎలా వేయాలో వివరించారు.

ఏరియా ఆస్పత్రిలో విద్యార్థికి శస్త్రచికిత్స

సీతంపేట: స్థానిక ఏరియా ఆస్పత్రిలో వైద్యులు అపెండిసైటిస్ ఆపరేషన్‌ను విజయవంతంగా చేశారు. ప్రభుత్వ ఐటీఐలో చదువుతున్న జన్ని శివాజీకి శనివారం తీవ్ర కడుపునొప్పి రావడంతో కుటుంబ సభ్యులు ఏరియా ఆస్పత్రిలో చేర్పించారు. వెంటనే సూపరింటెండెంట్ బి.శ్రీనివాసరావు అవసరమైన రక్తపరీక్షలు, స్కానింగ్ చేయగా.. ఇన్‌ఫెక్షన్ ఉందని గుర్తించి వెంటనే శస్త్రచికిత్సకు ఏర్పాట్లు చేశారు. సర్జన్‌లు డాక్టర్ డీవీ శ్రీనివాసరావు, సీతరామయ్య, ఎనస్తీషియన్ గౌరీశంకర్ విద్యార్థికి విజయవంతంగా ఆపరేషన్ చేశారు. బయట కార్పొరేట్ ఆస్పత్రిలో అయితే వేలాది రూపాయలు ఖర్చు అయ్యేదని, పైసా ఖర్చులేకుండా ప్రభుత్వ ఆస్పత్రిలో ఆపరేషన్ చేయడంతో విద్యార్థి కుటుంబ సభ్యులు ఆనందం వ్యక్తం చేశారు.

క్లుప్తంగా

ప్రకృతి వ్యవసాయంతో అధిక దిగుబడులు


పంటలు పరిశీలిస్తున్న ప్రకృతి వ్యవసాయ సిబ్బంది

సీతంపేట: ప్రకృతి వ్యవసాయంతో అత్యధిక దిగుబడులు సాధించవచ్చని ప్రకృతి వ్యవసాయ విభాగం రాష్ట్ర సలహాదారు పి.దేవుళ్లు అన్నారు. మండలంలోని దేవనాపురంలో ఆర్‌బీకే సిబ్బందితో శనివారం సమావేశమయ్యారు. అనంతరం క్షేత్రస్థాయిలో పంటలను పరిశీలించారు. ఏ గ్రేడ్, ఏటీఎం, గులిరాగి మోడల్స్‌పై ఆరా తీశారు. రైతులు, వ్యవసాయ సిబ్బందికి పలు సలహాలు, సూచనలిచ్చారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఏవై ముసలయ్య, డివిజనల్ మాస్టర్ ట్రైనర్ బాలు తదితరులు పాల్గొన్నారు.

వైద్య పరీక్షలు విస్తృతం చేయాలి


మాట్లాడుతున్న ఐటీడీఏ పీఓ కల్పనాకుమారి

సీతంపేట: సికిల్‌సెల్ ఎనీమియా టెస్టులు విస్తృతంగా చేయాలని ఐటీడీఏ ప్రాజెక్టుఅధికారి కల్పనాకుమారి అన్నారు. స్థానిక ఎస్ఆర్ శంకరన్ సమావేశ మందిరంలో ఎంహెచ్ఎల్‌పీ, ఏఎన్ఎంలతో శనివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సికిల్‌సెల్ ఎనీమియాపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. వ్యాధి లక్షణాలు ఉన్నవారిని గుర్తించి, సరైన చికిత్స అందివ్వాలని సూచించారు. క్షేత్రస్థాయిలో సిబ్బంది నిత్యం ప్రజలకు అందుబాటులో ఉండాలన్నారు. కార్యక్రమంలో శ్రీకాకుళం డీఎంహెచ్ఓ మీనాక్షి, తదితరులు పాల్గొన్నారు.

ఐటీఐలో స్వయం ఉపాధి శిక్షణ

సీతంపేట: స్థానిక ప్రభుత్వ ఐటీఐలో ఉచిత స్వల్పకాలిక శిక్షణలు ఇవ్వనున్నట్లు ప్రిన్సిపాల్ మూటక గోపాలకృష్ణ, డీఎస్‌డీఓ సాయికుమార్‌లు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. డొమెస్టిక్ డాటా ఎంట్రీ ఆపరేటర్, ఆటోమేటివ్ సర్వీస్ టెక్నీషియన్, ఏసీ మెకానిక్ కోర్సులకు కనీస విద్యార్హత పదోతరగతి చదివి ఉండాలన్నారు. సూయింగ్ మెషిన్ ఆపరేటర్‌కు 8వ తరగతి అర్హతతో శిక్షణ ఇవ్వనున్నామన్నారు. విద్యార్హత ధ్రువపత్రాలు, రెండు పాస్‌ఫోటోస్, ఆధార్‌కార్డు, బ్యాంకు ఖాతా జిరాక్స్‌లతో ఈ నెల 12లోగా దరఖాస్తు చేసుకోవాలన్నారు. మరిన్ని వివరాలకు ఫోన్ 7993795796కు ఫోన్ చేయాలన్నారు.

9న సోషల్ ఆడిట్‌పై సమీక్ష

గుమ్మలక్ష్మీపురం: ఈనెల 9న గుమ్మలక్ష్మీపురం ఎంపీడీఓ కార్యాలయం ఆవరణలో సామాజిక తనిఖీ నివేదికలపై సమీక్ష నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ ఎస్.సాల్మన్‌రాజు తెలిపారు. ఈ మేరకు శనివారం స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ.. 2022-2023 ఆర్థిక సంవత్సరంలో మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకంలో భాగంగా మండలంలోని 27 పంచాయతీల్లో వేతన రూపంలో రూ.16.01 కోట్లు, మెటీరియల్ రూపంలో రూ.2.60 కోట్లు ఖర్చు చేయడం జరిగిందని, దీనిపై ఆడిట్ బృందాలు గ్రామస్థాయిలో 17వ విడత సామాజిక తనిఖీలు నిర్వహించడం జరిగిందన్నారు. తనిఖీలో గుర్తించిన అంశాలపై సమీక్షించనున్నట్లు తెలిపారు. ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు, వేతనదారులు పాల్గొనాలని కోరారు.

యుద్ధప్రాతిపదికన మరమ్మతులు


అట్టలిలో బోరు మరమ్మతులు చేస్తున్న సిబ్బంది

పాలకొండ రూరల్: మండలంలోని అట్టలి గ్రామంలో పాడైన తాగునీటి బోర్లను శనివారం యుద్ధప్రాతిపదికన అందుబాటులోకి తీసుకొచ్చారు. బోర్లు పాడవడంతో గ్రామస్తులు తాగునీటి కోసం ఇబ్బందులు పడుతున్నారు. సమస్యపై స్పందించిన సర్పంచ్ కనుముల సంధ్యారాణి ఆర్‌డబ్ల్యూఎస్ అధికారుల దృష్టికి తీసుకువెళ్లి బోర్లు బాగుచేయించారు. అలాగే గ్రామంలో లోవోల్టేజీ సమస్యను విద్యుత్‌శాఖ అధికారుల దృష్టికి తీసుకువెళ్లడంతో కొత్త విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేశారు.

చురుగ్గా జన్‌మాన్ సర్వే

గరుగుబిల్లి: ప్రధానమంత్రి జన్‌మాన్ సర్వేను గ్రామాల్లో చురుగ్గా చేపడుతున్నారు. మండలంలోని ఆర్‌డీవలసలో పంచాయతీ కార్యదర్శి ఆధ్వర్యంలో శనివారం సర్వే నిర్వహించారు. ఎంపీడీఓ పైడితల్లి మాట్లాడుతూ..మండలంలోని పలు గ్రామాల్లో అర్హులైన 81 మందికి పీఎం జన్‌మాన్ కార్డులు పంపిణీ చేయడం జరిగిందన్నారు. ఇళ్లు లేని గిరిజనులకు పక్కాగృహాలు మంజూరు చేయడంతో పాటు ఇంటి నిర్మాణం కోసం రూ.2.40 లక్షలు మంజూరు చేయడం జరుగుతుందన్నారు. పూర్తిస్థాయిలో సర్వే చేపట్టి అర్హులైన గిరిజనులకు ఇళ్లు మంజూరు చేయడం జరుగుతుందన్నారు.